


ప్రతాప రవిశంకర్

రాత్రి పదిన్నర దాటుతోంది. కరెంట్ ఫెయిలవటంవల్ల చీకటిగా వుంది. ఆ ప్రదేశంలో ఎక్కడా జనసంచారం లేదు. ఎక్కడో దూరంగా ట్రంకురోడ్ మీద లారీలు, ఇతర వాహనాలు వెడుతున్న మోత వినిపిస్తోంది.

కొవ్వొత్తుల వెలుగులో, ఎదురెదురుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు కామేశ్వరి-కనకదుర్గ.

కిటికీ తలుపులు తెరిచివుంచటంవల్ల లోపలకు వస్తున్న గాలికి కొవ్వొత్తులు రెపరెపలాడుతున్నాయి.

"కిటికీ రెక్కలను మూయరాదూ. కొవ్వొత్తులు ఆరిపోతాయేమో" అన్నది కనకదుర్గ కామేశ్వరితో.

కుర్చీలోనించి లేచి కిటికీ రెక్కలను మూసి మళ్ళీ వచ్చి కూర్చుంది కామేశ్వరి.

ఆమె కూర్చున్న ఓ నిమిషానికి తలుపు మీద చప్పుడయింది.

కామేశ్వరి కనకదుర్గ ముఖంకేసి చూపింది.

"ఎవరై వుంటారు?" అడిగింది కనకదుర్గ.

"ఏమో!" అన్నది కామేశ్వరి.

"మీ అమ్మగారా?"

"అయివుండదు. ఈ రోజేగా వూరికి వెళ్ళింది. మళ్ళీ ఈ రాత్రికే ఎందుకు తిరిగొస్తుంది?" ప్రశ్నార్థకంగా చూపింది.

తలుపుమీద మరోసారి చప్పుడయింది.

"ఎవరు?" కనకదుర్గ అడిగింది.

జవాబులేదు.

ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. కామేశ్వరి ముఖంలో భయం కనిపించింది. కనకదుర్గ కొంచెం ధైర్యం కలది. అందుకే మరోసారి "ఎవరు?" అన్నది.

ఎవ్వరూ పలకలేదు.

"కిటికీలోంచి చూస్తాను" కుర్చీలోనించి లేవబోయింది కనకదుర్గ.

"వద్దు. కిటికీలోనించి చూసినా ఎవరూ కనిపించరు. గుమ్మానికీ, కిటికీకి చాలా దూరం వుంది. పైగా బయట చీకటి."

మళ్ళీ తలుపుమీద మునివేళ్ళతో టకటకా కొట్టిన చప్పుడు వినిపించింది.

కామేశ్వరి మరీ భయపడిపోయింది. వళ్ళంతా చెమట పట్టింది. శరీరంలో సన్నగా వణుకు మొదలయింది.

ఇద్దరూ తలుపులకేసి చూస్తున్నారు. చప్పుడు కాలేదు. మౌనంగా కూర్చున్నారు.

ఉన్నట్టుండి "మనుషులు కాదేమో" అన్నది కామేశ్వరి.

"మరి....ఎవరై వుంటారు?"

"దయ్యమేమో" కామేశ్వరికి దయ్యాల మీద నమ్మకం వుంది. దయ్యాల గురించి ఎన్నో పుస్తకాల్లో చదివింది. దయ్యాల చేష్టల గురించి ఎవరో చెప్పగా విన్నది.

"నీ మొహం....దయ్యమా.... ఇంకేమన్నానా.....దయ్యాల్లేవు.

భూతాల్లేవు. ఎవడో దొంగవెధవై వుంటాడు" అన్నది కనకదుర్గ. ఆమెకు దయ్యాలమీద నమ్మకం లేదు.

కామేశ్వరి మాట్లాడలేదు. కనకదుర్గే మళ్లీ మాటల్లో దిగింది. తను కాలేజీలో చదివిన రోజుల్లో తన స్నేహితుల గురించి, వారి మనస్తత్వాల గురించి చెబుతోంది.

కనకదుర్గ-కామేశ్వరి ఒకే ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నారు, ఇద్దరికీ పెళ్లి కాలేదు. కామేశ్వరి, ఆమె తల్లి ఆ గదిలో వుంటున్నారు. కామేశ్వరి మేనమామ ఆరోగ్యం బాగాలేదని ఉత్తరం రాగా చూసిరావటానికి ఆ రోజే వెళ్లింది తల్లి. ఆ రాత్రి తనకు తోడుగా పడుకోటానికి కనకదుర్గను పిలుచుకుంది కామేశ్వరి.

మాట్లాడుతూండగానే తలుపు మీద దబదబా చప్పుడయింది.

కామేశ్వరి భయంగా కనకదుర్గ కేసి చూసింది,

"నేను....కైలాసరావుని."

ఆతని గొంతు గుర్తుపట్టి గట్టిగా గాలి పీల్చుకొని వెళ్లి తలుపు తీసింది కామేశ్వరి.

లోపలకు వచ్చాడు కైలాసరావు.

"ఏమిటి తలుపులన్నీ బిగించి కూర్చున్నారు. నిద్రపోతున్నారేమో అనుకున్నాను. అరె.... మీరలా తడిసిపోయాదేం" అన్నాడు కామేశ్వరికేసి ఆశ్చర్యంగా చూస్తూ.

మాట్లాడలేదు కామేశ్వరి.

"ఇంతకుముందు మీరు తలుపు తట్టారా?" అడిగింది కనకదుర్గ.

"లేదండీ.... ఇదే రావటం. నేను, మా రూమ్మేటు ఎప్పుడో పడుకున్నాం, నాకు తల నొప్పిగా వుండి నిద్ర పట్టలేదు. వాడెప్పుడో నిద్రపోయాడు. అమృతాంజనం కోసం చూస్తే లేదు; ఐపోయింది. మిమ్మల్ని డిస్టర్బ్ చెయ్యటం ఇష్టం లేకపోయినా తలనొప్పి బాధ తట్టుకోలేక ఇలా వచ్చాను" అన్నాడు కైలాసరావు.

కనకదుర్గ ఏదో ఆలోచిస్తోంది.

"ఎందుకలా అడిగారు? ఇంతకు ముందు తలుపు తట్టిన చప్పుడయిందా?"

"అవును" తల వూపింది కామేశ్వరి.

"ఎవడో దొంగై వుంటాడు" అన్నాడు.

"నిల్చునే వున్నారు, కూర్చోండి" అన్నది కామేశ్వరి తన ఎదురుగా వున్న కుర్చీ చూపుతూ.

"ముందు అమృతాంజనం వుంటే ఇవ్వండి....తల పగిలి పోతోంది" కుర్చీలో కూర్చుంటూ అన్నాడు కైలాసరావు.

రెండు నిముషాల తర్వాత అలమార్లోనించి అమృతాంజనం సీసా తీసుకొచ్చి కైలాసరావుకి ఇచ్చింది.

"నిద్ర రావటంలేదు. బోర్ కొడుతోంది" అన్నాడు అమృతాంజనాన్ని కణతలకు రుద్దుకుంటూ.

"ఏమైనా కబుర్లు చెప్పండి" అన్నది కనకదుర్గ.

ఆమె అడగటమే తడవుగా ఏవో కబుర్లలోకి దిగిపోయాడు కైలాసరావు.

కైలాసరావు, అతని మిత్రుడు ధర్మరాజు ఇద్దరూ వేర్వేరు ఆఫీసుల్లో ఉద్యోగం చేస్తున్నారు. కామేశ్వరి వుంటున్న గదికి ఎదురుగా వున్న గదిలో వుంటున్నారు.

కామేశ్వరి కైలాసరావు మాటలు వింటున్నా ప్రతిసారీ తెరచి వున్న తలుపుల గుండా బయటకు చూస్తోంది. కైలాసరావు తను చిన్నతనంలో చేసిన సాహస కృత్యాల గురించి వర్ణించి మరీ చెబుతున్నాడు. కనకదుర్గ 'ఊ' కొడుతూ వింటోంది.

"ఒకసారి ఏమైందనుకున్నారు: మా వూరికి నాలుగు మైళ్ళ దూరంలో వున్న చిన్న టౌన్‌లో రెండో ఆట సినిమా చూసి ఒక్కడినే తిరిగొస్తున్నాను. నాకు దూరంగా చాలామంది కబుర్లు చెప్పుకుంటూ వెడుతున్నారు. పొలాల మధ్య నించి దారి. ఆ తర వాత చింతల తోపు. కీచురాళ్ళు చెవులు పగిలేలా అరుస్తున్నాయి. నాకు కొంచెం భయం కలిగింది. చలికాలపు రోజులు. ఎట్లాగో పొలాల్లో నుంచి నడిచి చింతల తోపులోకి వచ్చాను. అంతా చీకటి. ఆకాశంలో చంద్రుడు వున్నా కొంచెం కూడా వెన్నెల తోపులో పడటంలేదు. దట్టంగా, రాక్షసుల్లా వున్నాయి చింతచెట్లు. ఆ తోపులో దయ్యం వుంటుందని వినికిడి. నాకు ఒళ్లు ఝల్లుమంది. వణుకు పుట్టింది. ధైర్యాన్ని కూడదీసుకొని నడుస్తున్నాను. కొంత దూరం నడిచేసరికి ఓ చింత చెట్టు పక్కనే నల్లగా ఏదో ఆకారం...." కైలాసరావు పూర్తి చెయ్యలేదు.

కెవ్వుమని కేకపెట్టి భయంతో కైలాసరావు మీద పడి, అతన్ని గట్టిగా బల్లిలా కరుచుకుపోయింది కామేశ్వరి.

"ఏమయిందండీ?" అడిగాడు

కైలాసరావు. మాట్లాడలేదు కామే శ్వరి అతన్ని వదల్లేదు. గజగజ వణుకుతోంది. గుండెలు అదురుతున్నాయి. కైలాసరావు ఆమె వీపు మీద నిమురుతున్నాడు.

"ఏమైంది కామేశ్వరీ?" అంటూ తన కుర్చీలోనించి లేచి కామేశ్వరి దగ్గరకు వచ్చి ఆమె భుజం మీద చెయ్యివేసి కదుపుతూ అడిగింది కనకదుర్గ.

కనకదుర్గ కుదపటంతో కైలాసరావు మీద నించి లేచింది కామేశ్వరి. ఓ గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది కనకదుర్గ. నీళ్లు తాగిన తర్వాత కామేశ్వరి గుండె కొంచెం కుదుటపడింది.

"ఎందుకలా భయపడ్డారు? నేను దయ్యం గురించి చెప్పగానే భయమేసిందా?" అడిగాడు కైలాసరావు.

"కాదు. దయ్యం కనిపించింది" అన్నది చిన్నగా.

"దయ్యమా!!" ఇద్దరూ ఒకే సారి అన్నారు.

"అవును. మీరు చెబుతుంటే వింటూ ఆ క్రోటన్ మొక్కలకేసి చూశాను. అంతకుముందు అక్కడ చీకటిగా వుంది. తర్వాత చూడగానే ఏదో ఆకారం తెల్లగా, పొడుగ్గా నిలబడి కనిపించింది. చూడగానే భయమేసింది. కేక పెట్టాను."

"ఏదీ.... నేను చూస్తాను" అని కుర్చీలోనించి లేచి గుమ్మం దగ్గరకు వచ్చి క్రోటన్ మొక్కలకేసి చూశాడు. కనకదుర్గ కూడా చూసింది. అక్కడ ఏమీ కనిపించ లేదు. చీకటిగా వుంది.

"మీరు భ్రమపడి వుంటారు. అక్కడ ఏమీలేదు" అన్నాడు కైలాసరావు.

"లేదు. నేను భ్రమపడలేదు. నిజంగా చూశాను" అన్నది కామేశ్వరి.

"మీకలాగే అనిపిస్తుంది. ఏదైనా ఒక విషయాన్ని గురించి మనం ఆలోచిస్తున్నప్పుడు అలా భ్రమ పడటం సహజం. ఇప్పుడు పాముల గురించి ఆలోచిస్తున్నామనుకోండి. ఆ సమయంలో తాడు కనిపించినా పామనుకొని భయపడతాం. అంతదాకా ఎందుకు? ఆ రోజు నేను చింత చెట్టు పక్కనే నల్లని ఆకారం కనిపించిందన్నానా, దయ్యమేమో అనుకున్నాను. తీరా చూస్తే అక్కడ వున్నది తల నరికిన చింత చెట్టు మొదలు.... అంతా భ్రమ" అన్నాడు కైలాసరావు.

కనకదుర్గ కూడా కైలాస

(మిగతా 64వ పేజీలో)

బరువుగా దొర్లిపోతున్నాయి. ఉన్నట్టుండి గుమ్మాని కడ్డంగా తళుక్కున ఓ మెరుపు మెరిసినట్టయింది. ఒక స్త్రీమూర్తి! పచ్చని పట్టు చీర. వాలుజడలో మల్లెపువ్వులు. నుదుట జ్యోతిలా వెలుగుతున్న బొట్టు. ముఖంలో ప్రసన్నత. పెదవుల పైన చిరునవ్వు-రవివర్మ చిత్రంలో లక్ష్మీదేవికి ప్రాణప్రతిష్ఠ చేసినట్టుంది. ఆమె లోపలికి వచ్చింది. చేతులు జోడించి పెద్దలందరికీ నమస్కరించింది. అప్రయత్నంగా ప్రతి నమస్కారాలు చేసిన వాళ్ళే ఎక్కువ. సగం దాకా పైకెత్తి, చేతులు క్రిందికి దించుతున్న జాగరూకుల సంఖ్య చాలా తక్కువ.

భార్యను వెన్నంటి లోపలికి వచ్చిన భానుప్రకాష్‌లో నైనా భార

---

## దయ్యం

(58వ పేజీ తరువాయి)

రావునే సపోర్టు చేసింది.

"నాకు నిద్ర వస్తోంది. మీరు తలుపులు గట్టిగా వేసుకు పడుకోండి కామేశ్వరిగారూ.... అనవసరంగా దయ్యాల గురించి ఆలోచించకండి.... వెడతాను గుడ్ నైట్" అని బయటకు వెళ్ళిపోయాడు కైలాసరావు. అతను బయటకు వెళ్ళిన ఓ నిముషానికి కరెంటు వచ్చింది.

కైలాసరావు తన గదిలోకి వెళ్ళేసరికి అతని రూమ్మేటు ధర్మరాజు కుర్చీలో కూర్చుని సిగరెట్ కాలుస్తున్నాడు.

"గ్రాండ్ సక్సెస్ రాజూ.... థాంక్యూ వెరీ మచ్.... అంతా మనం అనుకున్నట్టే జరిగింది" అన్నాడు కైలాసరావు నవ్వుతూ.

"థాంక్స్ చెబితే చాలదు. రేపు నా ఖర్చులన్నీ నువ్వే బేర్ చెయ్యాలి" అన్నాడు ధర్మరాజు.

తల వూపుతూ తనూ ఓ సిగరెట్ వెలిగించుకొని తల పైకెత్తిన కైలాసరావుకి గుమ్మం దగ్గర యిద్దరమ్మాయిలు కనిపించారు. ఒకామె కనకదుర్గ, మరో ఆమె కామేశ్వరి. కైలాసరావు పెదవుల మధ్య సిగరెట్ కిందపడిపోయింది.

ధర్మరాజు కైలాసరావు పక్కకెళ్లి మెల్లగా "మనం అనుకున్న మాటలకి వాళ్లు నిజంగా కామేశ్వరీ, కనకదుర్గ అయితే కోపగించుకోవలసింది, కాని నవ్వుతున్నారు." అన్నాడు.

కైలాసరావు కంగారుగా వారి పాదాల వంక చూశాడు. పాదాలు వెనక్కి తిరిగి వున్నాయి.

"బాబోయ్ దయ్యాలు" అంటూ కెవ్వున కేకపెట్టి కింద పడిపోయాడు.